క్లుప్తంగా

నీరంతా రోడ్డు పాలు



మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని బైపాస్ వద్ద ఉన్న మహిళా ప్రాంగణం ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో నీరంతా వృథాగా పోతోంది. అసలే ఎండాకాలం భూగర్భ జలాలు ఎండిపోయి నీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పలుకాలనీల్లో నీరు సరఫరా కాక అల్లాడుతున్నారు. మూడు రోజులుగా నీరు రోడ్డుపై పారుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం ఎంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి



పనులను పరిశీలిస్తున్న సంగారెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధి మైఫేర్ మార్గంలో నూతనంగా వేస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. రోడ్డును అభివృద్ధి చేస్తున్న మున్సిపల్ అధికారులకు స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో స్వచ్ఛతా పనులు



పరీక్ష కేంద్రాలను శుభ్రం చేస్తున్న కార్మికులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో శుభ్రత పనులు నిర్వహించి సర్వం సిద్ధం చేశారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు బొల్లారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏ,బీ కేంద్రాలు, మోడల్ స్కూల్‌తో మూడు పరీక్షా కేంద్రాల్లో తరగతి గదులు, ప్రాంగణాలను శుభ్రం చేశారు. పరీక్షలు రాసేందుకు వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని పనులు పూర్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నీటి సమస్యను తీర్చండి



ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలం పరిధి కన్‌సాన్‌పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు బుధవారం ఎంపీఓ సోంనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా కాలనీలో నీటి సమస్య ఏర్పడిందని, కనీస అవసరాలు తీర్చుకునేందుకు నిత్యం వ్యవసాయ బోరు బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. అధికారులు వెంటనే కాలనీలో మినీట్యాంకు నిర్మాణం చేపట్టి నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు

జహీరాబాద్ టౌన్: మండలంలోని మల్‌చెల్మలో సంగారెడ్డి వెల్‌నెస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత మెగావైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కరుణ, కేతావత్ ధర్మనాయక్ తదితరులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. పలువురికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ సంగమేశ్వర్, సిబ్బంది అశోక్, మధు పాల్గొన్నారు.

నిఘా నేత్రంపై నిర్లక్ష్యం

- జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో పనిచేయని సీసీ కెమెరాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

నేరాల నియంత్రణ, నేరస్తుల జాడ పట్టించడంలో కీలకమైన నిఘానేత్రంపై పోలీస్‌శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికారుల నిర్వహణ లోపం వల్ల పట్టణంలోని పలు చోట్ల సీసీ కెమెరాల పని చేయడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి కెమెరాలకు త్వరగా మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సంగారెడ్డి క్రైమ్: నేరాలను నియంత్రించడంతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, అసాంఘిక కార్యకలాపాలను అదుపులో ఉంచేందుకు ఎంతో ఉపయోగపడే నిఘా నేత్రాల పనితీరు పట్టణంలో చాలా చోట్ల అస్తవ్యస్తంగా ఉంది. పట్టణంలోని 38 వార్డుల్లో పలుచోట్ల సగానికి పైగా కెమెరాలు పని చేయడం లేదు. వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



నేలచూపులు చూస్తున్న నిఘా నేత్రం

జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోని ప్రధాన కూడలిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం విస్తరిస్తున్న జనాభా ఆధారంగా కెమెరాల ఏర్పాటు అంతే ముఖ్యం. పట్టణ స్టేషన్ పరిధిలో లక్షల రూపాయల వ్యయంతో ప్రజల శాంతి భద్రత దృష్ట్యా కెమెరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో రోజురోజుకు అటు పారిశ్రామికంగా, జనాభా పరంగా ఎంతో విస్తరిస్తోంది. దీంతో రోజు ఏదో ఒక చోట దొంగతనాలు, యువతి, యువకులు తప్పించుకుపోవడం వంటి కేసులు పెరిగిపోతున్నాయి.

నిర్వహణ లోపంతోనే ఇబ్బందులు

అధికారుల నిర్వహణ లోపం కారణంగా పట్టణంలో ఒక కెమెరా కూడా పని చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత నెల మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై అమ్మవారి విగ్రహ ధ్వంసం కేసులో, నిందితులను పట్టుకోవడానికి పోలీసులకు 10రోజుల సమయం పట్టింది. దీనికి ప్రధాన కారణం అక్కడ ఏర్పాటు చేసిన నిఘా నేత్రం పని చేయకపోవడమే.

మరమ్మతులు చేసేలా చర్యలు..



పట్టణంలో పలు చోట్ల సీసీ కెమెరాలు పని చేయక పోవడం వాస్తవం. వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల సమన్వయంతో సీసీ కెమెరాలు పని చేసేలా చర్యలు తీసుకుంటాం. మరమ్మతులకు నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు వివరించాం.. మంజూరు కాగానే త్వరలో మరమ్మతులు చేయించి, సరిగ్గా పని చేసేలా చర్యలు తీసుకుంటాం.

– పట్టణ సీఐ రమేష్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితరులు

క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: క్రిస్టియన్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలోని వివిధ చర్చిలకు మంజూరు చేసిన ఐదు లక్షల రూపాయల చెక్కులను బుధవారం చర్చి ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనివార్య కారణాలతో చెక్కుల పంపిణీ ఆలస్యం అయిందన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన ప్రతి పైసాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆయా చర్చిల ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పటాన్‌చెరు టౌన్ : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ వినాయక రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు మానవ అక్రమ రవాణా, సైబర్ ఆధారిత అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలందరూ సైబర్ నేరాల, మానవ అక్రమ రవాణాపైన పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరస్తుల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎవరైనా సైబర్ వలలో పడితే వెంటనే 1930లకు కాల్ చేస్తే నగదు ఫ్రీజ్ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఫైనాన్స్ డీపీఎం కొమురయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సల్మా మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ వినాయకరెడ్డి

ఇరువర్గాల మధ్య ఘర్షణ

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని రెడ్డిఖానాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణ పడి పలువురికి తీవ్ర గాయాలయి ఆస్పత్రిలో చేరారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి ప్రశాంత్ నూతన ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. దానికి అవసరమైన ఇసుక కంకర ఇతర సామగ్రిని సమీపంలోని మాచుకూరి కృష్ణ స్థలంలో ఉంచాడు. కృష్ణ స్థలం నుంచి ఇసుక, కంకర తీయాలని పలుమార్లు ప్రశాంత్‌కు సూచించిన తీయకపోవడంతో మంగళవారం రాత్రి ఇదే విషయమై ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. వెంటనే పోలీసులు చేరుకొని ఇరు వర్గాలకు నచ్చజెప్పి శాంతింపచేశారు. బుధవారం ఉదయాన్నే మరోసారి ఇరు వర్గాలు ఒకరిపై ఒకరి దాడులు చేసుకోగా పలువురికి తలలు పగిలి తీవ్రగాయాలయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఘటనకు సంబంధించిన బాధితులను ఆస్పత్రిలో పలువురు బీజేపీ నాయకులు పరామర్శించారు.



బాధితులను పరామర్శిస్తున్న బీజేపీ నేత మల్లేశంగౌడ్

ఇందిరమ్మ రాజ్యంలోనే సమన్యాయం

కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు టౌన్: బీసీలకు రాజకీయ, ఉద్యోగ, విద్య, ఆర్థిక రంగాల్లో 42 శాతానికి రిజర్వేషన్ల పెంపు బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించడం చారిత్రాత్మకమని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. బుధవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లో పీసీసీ పిలుపు మేరకు అసెంబ్లీలో బీసీ బిల్లు ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందన్నారు. బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి బీసీ రిజర్వేషన్లు పెంచేలా అసెంబ్లీలో బిల్లుపెట్టి ఆమోదింపజేయడం ద్వారా యావత్ బీసీ సమాజానికి సీఎం రేవంత్ రెడ్డి మేలు చేకూర్చారని కొనియాడారు. ప్రజల పక్షాన పనిచేస్తూ, ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ అన్ని వర్గాలకు సమన్యాయం చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మరోసారి రుజువైందన్నారు.



రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నీలం మధు

ఏకరూప దుస్తులు నాణ్యతగా కుట్టాలి



మహిళలకు సూచనలిస్తున్న జయశ్రీరాజ్

నారాయణఖేడ్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం తరఫున పంపిణీ చేసే ఏకరూప దుస్తులను నాణ్యతగా కుట్టాలని ఇందిరా క్రాంతి పథకం డీపీఎం జయశ్రీ రాజ్ సూచించారు. ఖేడ్‌లో నిర్వహిస్తున్న ఏకరూప దుస్తుల కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుట్టును బాగా నేర్చుకుని గ్రామస్థాయిలో మహిళలకు శిక్షణిస్తూ నాణ్యతగా కుట్టేలా చూడాలని.. అందుకు తగిన సూచనలు, సలహాలనిచ్చారు. ఆమె వెంట ఐకేపీ ఏపీఎంలు వంశీకృష్ణ, సాయిలు, కుమార్, చంద్రశేఖర్, సీసీలు వెంకట్, సుందర్ ఉన్నారు.

గణేష్ గడ్డ హుండీ లెక్కింపు



ఆదాయాన్ని లెక్కిస్తున్న గ్రామస్తులు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం గ్రామ పంచాయతీ గణేష్ గడ్డ దేవస్థానంలో హుండీని బుధవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఆలయ ఈఓ లావణ్య సమక్షంలో లెక్కించారు. 103 రోజులకు గాను రూ.28 లక్షల 20 వేలు వచ్చినట్లు ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్లు ఈశ్వర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హుండీలో వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్, పోలీసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు, ఎస్‌సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. దీంతో బుధవారం జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ముఖ్యనాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా లబ్ధి పొందుతారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిలుపాస్ అయినందున 30 సంవత్సరాలు కల నెరవేరిందని తెలిపారు. అన్ని వర్గాలకు సమన్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని వివరించారు.



సంగారెడ్డి జోన్: సంబురాల్లో పాల్గొన్న నిర్మలారెడ్డి తదితరులు



జహీరాబాద్: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



పటాన్‌చెరు టౌన్: హాస్టల్ విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టిన నాయకులు



నారాయణఖేడ్: సంబురాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జోగిపేటలో సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

సంక్షిప్త వార్తలు

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 16 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా 12 మందికి రూ.2 వేల చొప్పున, నలుగురికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ ఉపాధి హామీ పనుల పరిశీలన

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఫత్తేపూర్‌లో బుధవారం ఎంపీడీఓ రమేష్‌బాబు ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పనుల గురించి తెలుసుకున్నారు. అలాగే, కల్హేర్‌లో నర్సరీ పనులు సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, సిబ్బంది వేణుమాధవ్, శ్రీనివాస్‌రెడ్డి, రఘువీర్ పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల కేంద్రంలోని 33/11 సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు ఉ.8 గంటల నుంచి 10 గంటల వరకు నల్లవల్లి, కానుకుంట సబ్‌స్టేషన్‌లతో పాటు దుండిగల్ ఎయిర్‌పోర్టు, అకాడమీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులు పారిశ్రామికవేత్తలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

◆ రెచ్చిపోతున్న సైబర్ కేటుగాళ్లు..

జహీరాబాద్ టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. అమాయకులను టార్గెట్ చేస్తూ డబ్బులు కొట్టేస్తున్నారు. జహీరాబాద్ పట్టణానికి చెందిన వ్యాపారి గుంజెట్టి సిద్ధేశ్వర్ అకౌంట్ నుంచి సైబర్ కేటుగాళ్లు బుధవారం రూ.62 వేలు కొట్టేశారు. సైబర్ మోసగాళ్లు పంపిన లింక్‌ను పొరపాటున ఓపెన్ చేశాడు.. లేదో తెలియదు కానీ ఆయన అకౌంట్ నుంచి రూ.10 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. బ్యాంక్ నుంచి లోన్ తీసుకున్నందున ఇన్‌స్టాల్‌మెంట్ కట్ అయిందనుకున్నాడు. కొన్ని సెకన్లకు రూ. 5 వేలు, ఆ తరువాత మరో రూ. 5 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. మోసపోయానని గ్రహించి బ్యాంకర్లతో మాట్లాడి అకౌంట్ బ్లాక్ చేసే లోపు మరో రూ.42 వేలు కట్ అయ్యాయి. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

◆ హెల్త్ అండ్ హైజిన్ శానిటేషనపై శిక్షణ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. గడ్డపోతారం పారిశ్రామికవాడలోని హెటిరో పరిశ్రమ ఆధ్వర్యంలో హెల్త్ అండ్ హైజిన్ శానిటేషన్ అంశాలపై నిపుణులచే ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయులు, విద్య వాలంటీర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, పరిశ్రమ ప్రతినిధులు రామారావు, రాజు ఉపాధ్యాయులు విద్యావాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నిపుణులు

◆ కౌలు ఆదాయం రూ.4.97లక్షలు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని రామాలయ భూములకు సంబంధించి కౌలుకు బుధవారం ఆలయ ఆవరణలో వేలంపాట నిర్వహించారు. వేలంలో రూ.4.97లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శివరుద్రప్ప తెలిపారు. సర్వే నెం.87లోని 27.16 ఎకరాలకు జుజాల్‌పూర్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి రూ.3.90 లక్షలు, సర్వేనెం.106లోని 5.23 ఎకరాలకు గాను ఖేడ్‌కు చెందిన పల్లె నారాయణ రూ.72 వేలకు, సర్వేనెం. 90లోని 1.09 ఎకరాలకు చాంద్‌ఖాన్‌పల్లికి చెందిన చాప్తా నర్సింహులు రూ.35 వేలకు దక్కించుకున్నారని వివరించారు. వేలంపాటల్లో ఆలయ కమిటీ బాధ్యులు హన్మాండ్లు, వివేకానంద్, పాండు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెంలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రం (బొంతపల్లి) భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి దంపతులు, ఆలయ ఈఓ శశిధర్ గుప్తాతో కలిసి స్వామివారికి సుప్రభాత సేవలతో పాటు అభిషేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాట్లు చేశారు. స్వామివారి సన్నిధిలో నిత్య కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పీఠాధిపతులు, పర్యవేక్షణ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రతాప్ రెడ్డి దంపతులు

వరిలో కాంప్లెక్స్ ఎరువులు తగ్గించాలి

ఏడీఏ నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): వరిసాగులో కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలని డివిజన్ ఏడీఏ నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం కల్హేర్ మండలం బీబీపేట్ శివారులో వరి, జొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్క ఎదుగుదల కోసం దుక్కిలో మాత్రమే డీఏపీ లేదా సింగిల్ సూపర్ ఫాస్ఫెట్ వాడాలన్నారు. యూరియాను అధికంగా వాడవద్దని తెలిపారు. అగ్గి తెగులు నివారణ కోసం అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశం, ఏఈఓ కృష్ణావేణి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



వరిపంట పొలాలు పరిశీలిస్తున్న ఏడీఏ

ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

వట్‌పల్లి(అందోల్): సింగూర్ ప్రాజెక్ట్ ఎడమ కాల్వకు నీళ్లు విడుదల చేయకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ఆరోపించారు. బుధవారం అందోల్ మండలంలోని కోడేకల్ గ్రామ శివారులో సింగూర్ ప్రాజెక్టు ఎడమ కాలువ పరివాహక పంట పొలాలను సీపీఎం జిల్లా నాయకుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగూర్ ప్రాజెక్ట్ నుంచి నీళ్లు వదలకపోవడంతో పంట పొలాలు పూర్తిగా ఎండిపోయి రైతులకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. యాసంగి సీజన్ ప్రారంభంలో కాల్వల పనులు చేపడుతున్నామని రైతులకు చెబితే పంటల సాగు చేసే వారు కాదన్నారు. ఇది పూర్తిగా ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.40 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేవరకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్, పార్టీ ఏరియా కార్యదర్శి విద్యాసాగర్ నాయకుల బృందం రైతులతో కలిసి ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు.



ఎండిన పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు